


# ప్రియురాలు పిలిచె

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



### (గత సంచిక తరువాయి)

**బాయ్ ముందు మామూలుగా** చూశాడు. సూర్యుడు తూర్పు నుంచి లేస్తూంటే క్రమక్రమంగా ఆకాశం ఎలా ఎర్రబడుతుందో తరువాత్తరువాత అలా అతడి మొహంలో ఆశ్చర్యం తొంగిచూసింది. అది ఆశ్చర్యం కూడా కాదు. విభ్రమం. ఒక అతీతమైన ఆస్వాదనతో ''...హా'' అన్నాడు.

చాలు. ఆ అభినందన ఎంత గుండెల్లోతుల్నుంచి వచ్చిందీ ఆర్టిస్టుకి తెలిసిపోయింది. అనుభవజ్ఞుడైన రచయిత, ఒక ఉత్తరం పట్టుకోగానే అది అచ్చులో పేరు చూసుకోవటానికి వ్రాసిందా? ఏళ్ళ తరబడి అభిమానాన్ని కాగితం పూతరేకుల మధ్య మడిచి పంపిందా? అనేది ఎలా చెప్పగలడో, అలాగే అవతలి వాళ్ళది భట్రాజు పొగడ్తో, వాస్తవమైన ఫీలింగ్ చెప్పటమో కళాకారుడికి వెన్నతో పెట్టిన విద్య. 'హ' అన్న ఒక్క అక్షరంలో అంత మెచ్చుకోలుని చూడగలిగాడు కార్తికేయ.

''ప్రైజ్ మీకే సార్'' ఇంకా బొమ్మ వైపే తదాత్మ్యంగా చూస్తూ అన్నాడు బాయ్. కార్తికేయ నవ్వి ''దేశంలోని పెద్ద పెద్ద వాళ్ళందరూ వస్తున్నారు. అన్నట్టు నీ పేరేమిటి?'' అని అడిగాడు.

''హమాలీ సాబ్''

''కొంచెం టీ తీసుకురాగలవా?''

''తప్పకుండా'' అంటూ హమాలీ పరుగెత్తాడు.

బయట గాలి శబ్దం ఎక్కువైంది. కార్తికేయ పెయింటింగ్‌ని మళ్ళీ ప్యాక్ చేయబోతూ ఉండగా ఫోన్ మ్రోగింది. సిమ్లాలో తనకి ఫోన్ చేసేది ఎవరా అనుకుంటూ రిసీవర్ ఎత్తాడు.

''హల్లో నేనూ, కళ్యాణిని. రూమ్ దొరికిందా?'' తను చేరుకున్న అయిదు నిముషాల్లోనే ఫోన్ రావటం అతడికి సంతోషంగా అనిపించింది. ''... దొరికింది కళ్యాణీ! అంతా బాగానే ఉంది.''

''ఏదైనా కావలసివస్తే కళ్యాణ్‌సింగ్‌ని కాంటాక్టు చేయండి. హిమాచల్‌ప్రదేశ్ కమీషనర్ ఆఫ్ పోలీస్. సిమ్లాలోనే ఉంటారు.''

‘‘అంత అవసరం రాదనుకుంటాలే కళ్యాణీ’’ అన్నాడు. ఆమె మరికొంచెం సేపు మాట్లాడింది. అతను ఫోన్ పెట్టేస్తుంటే హమాలీ టీ తీసుకొచ్చి ఇచ్చి వెళ్ళాడు. అది తాగి, తిరిగి అతడు పెయింట్ ప్యాక్ చేయబోతోంటే మళ్ళీ ఫోన్ మ్రోగింది.

‘‘హల్లో’’ అన్నాడు. అవతల్నుంచి అమ్మాయి కంఠం ‘‘గుడ్ ఈవెనింగ్ సర్. నేను రిసెప్షన్ నుంచి మాట్లాడుతున్నాను. మీరు రూమ్ నెంబర్ 21 తీసుకోండి. దీని కన్నా అది మంచి రూమ్’’ అంది. ఆ అమ్మాయి కంఠంలో అల్లరి నవ్వుని అతను గుర్తించలేదు.

‘‘ఫర్వాలేదు. ఇది బాగానే ఉంది.’’

‘‘ఇది మరీ గాలికి ఎదురుగా ఉంటుంది సార్. నిద్రపట్టదు. లక్కీగా అది ఖాళీ అయింది.’’

‘‘సరే అయితే!’’

‘‘సార్...’’ చిన్న సందిగ్ధం. ‘‘...మీరు అడ్వాన్స్ ఇవ్వలేదు. ఓ అయిదొందలు పంపిస్తే.’’

‘‘నన్నడగలేదే. దానిదేముంది. అలాగే బాయ్ ని పంపండి.’’

‘‘థాంక్యూ సర్–’’ అమ్మాయి ఫోన్ పెట్టేసింది. దాదాపు ఆరుగురు అమ్మాయిలూ, నలుగురు అబ్బాయిలూ ఆ అమ్మాయి వైపు ఎగ్జయిటింగ్‌గా చూశారు.

ఆ అమ్మాయి పేరు అనూజ్ఞ. ‘‘పందెంలో మొదటి భాగం విజయవంతంగా పూర్తయింది. మనకి రూమ్ దొరకబోతోంది’’ అంది నవ్వుతూ హిందీలో. ఆ తరువాత మళ్ళీ ఫోన్ ఎత్తి ‘‘రిసెప్షన్‌కి ఇవ్వండి’’ అంది. అటువైపు మానేజర్ లైన్‌లోకి రాగానే, పక్కనున్న క్లాస్‌మేట్‌కి ఇస్తూ ‘‘నేను చెప్పింది గుర్తుంది కదా. అలా చెప్పు’’ అంది.

అవతల్నుంచి మానేజర్ ‘‘హల్లో’’ అనగానే ఆ కుర్రవాడు గొంతు సర్దుకుని ‘‘నేను... కార్తికేయని మాట్లాడుతున్నాను. రూమ్ ఖాళీ చేస్తున్నాను. ఆ విషయం చెప్పటానికే ఫోన్ చేశాను’’ అన్నాడు గంభీరంగా. మేనేజర్ కంగారుపడ్డాడు. ‘‘అదేమిటి సార్. మా హోటల్లో అదే బెస్టు రూము.’’

‘‘పెద్ద హోటల్‌కి వెళ్ళిపోతున్నాను. హోటల్ అశోకా...’’

‘‘కమీషనర్‌గారు ఏమన్నా అనుకుంటారేమో సార్. ఆయన చెప్పారనే ఇంకెవరిదో కాన్సిల్ చేసి మీకిచ్చాను.’’

‘‘ఫర్వాలేదు. ఆయనకు నేను చెబుతాను. మీరు బాయ్ ని పంపండి. అయిదొందలు పంపిస్తాను. బిల్ సెటిల్ చేసెయ్యండి.’’

‘‘బిల్లా? వచ్చి అయిదు నిముషాలే కదండీ అయింది. బిల్ వద్దులేండి...’’

‘‘వ్వాట్ నాన్సెన్స్. నాకేమైనా ధర్మానికి ఇచ్చారా? మీరు తీసుకోకపోతే కమీషనర్‌గారికి చెప్పాల్సి ఉంటుంది.’’

‘‘అ... అలాగే సార్...’’ అన్నాడు మానేజరు. కుర్రాడు ఫోన్ పెట్టేసి మిగతా వాళ్ళ వైపు గర్వంగా చూశాడు. అందరూ చప్పట్లు కొట్టారు. సన్నగా ఉన్న ఓ అమ్మాయి ‘‘ఇదంతా కరెక్టుగా అవుతుందంటావా? నాకేమిటో భయంగా ఉందే’’ అంది.

‘‘అబ్బా. ఢిల్లీ యూనివర్శిటీ స్టూడెంట్స్ పరువు పోగొట్టకు. మన ప్లాన్ సక్సెస్ అయి తీరాలి. ఈ పక్కరూమ్ మనకి వచ్చి తీరాలి. అన్నట్టు మనం కొంచెం సేపు పాటు మన రూమ్ ఖాళీచేయాలి. ఆ మహాశయుడు ఇక్కడికే వస్తాడు. గోపాల్. నువ్వెళ్ళి మిగతాపని... ఐటమ్ నెంబర్ త్రీ పూర్తిచెయ్యి’’ అంది అనూజ్ఞ.

‘‘ఎంత చకచకా సూచన్లు ఇస్తున్నావే కమాండర్‌లాగా’’ జీన్స్ వేసుకున్న అమ్మాయి అంది.

‘‘ఇవ్వకపోతే ఎలా? పందెం నెగ్గకపోతే పేరు మార్చుకుంటానందిగా’’ అన్నారు ఇంకెవరో. ఈ లోపులో గోపాల్ అనే కుర్రాడు బయటకెళ్ళి వరండా చివర్న ఉన్న బాయ్ ని పిలిచాడు. ‘‘అదిగో ఆ రూమ్ నెంబర్ 22లో ఉన్న సామానులు తీసుకొచ్చి 21లో పెట్టు’’ అన్నాడు.

‘‘ఎందుకు సార్?’’

‘‘ఎందుకైతే నీకెందుకోయ్? ఆయన మాకు తెలిసినవారు’’ గద్దించాడు గోపాల్. ఆ కుర్రాడు బెదిరి ‘‘అలాగే సాబ్’’ అంటూ వెళ్ళాడు. వాడు వెళ్ళేసరికి మరో రూమ్‌బాయ్ కి అయిదొందలు ఇస్తున్నాడు కార్తికేయ. వాడు అది తీసుకెళ్ళి మేనేజర్‌కి ఇచ్చాడు. మేనేజర్ బిల్ ప్రిపేర్ చేసి, అయిదొందలకి రసీదు వ్రాసి, రిజిష్టర్‌లో రూము ఖాళీ అయినట్లు వ్రాసుకున్నాడు.

రిసెప్షన్ పక్కనే నిలబడి ఓరగా చూస్తున్న అమ్మాయి ఏమీ తెలియనట్టు ‘‘ఏమిటి? మా కోసమే ఏదో రూము ఖాళీ అయినట్టుంది?’’ అంది.

‘‘ప్రపంచంలో ఇంకా నిజాయితీ మిగిలింది మాడమ్. అయిదు నిముషాలున్నందుకే పూర్తి అద్దె ఇచ్చి వెళ్ళిపోతున్నాడు కష్టమరు’’ అన్నాడు మేనేజర్.

‘‘మా అదృష్టం కూడా బావుంది. ఆ రూమ్ మాకిస్తారా? పది మందిమి ఒక రూమ్‌లో సర్దుకో లేక ఛస్తున్నాం’’ రిక్వెస్టు చేస్తున్నట్టు అడిగింది ఆ అమ్మాయి. మేనేజర్ ఆ రూమ్ వాళ్ళకి ఇస్తున్న సమయంలో, రూమ్‌బాయ్ కార్తికేయ గదిలో ప్రవేశించాడు. ‘‘మీ సామానులు సాబ్.’’ అంటూ.

‘‘రూమ్ నెంబర్ 21లోకి మార్చటానికా?’’ కార్తికేయ అడిగాడు.

‘‘అవును సాబ్’’ అంటూ సామానులు పట్టుకుని బయటికొచ్చాడు. ఈ లోపులో మొదటి కుర్రాడు రూమ్ ఖాళీ చేసిన బిల్ తాలూకు రసీదు పట్టుకొస్తూ ‘‘ఇదిగో సార్ రసీదు...’’ అంటూ కవర్ ఇచ్చాడు. కార్తికేయ దాన్ని జేబులో పెట్టుకుని పక్క గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ గదిలో కుర్రాడు సామానులు పెట్టి సెల్యూట్ చేశాడు. ''ఇదేమిటోయ్. రెండు గదులూ ఒకేలా ఉన్నాయిగా. ఎందుకు మార్చారు?'' అన్నాడు కార్తికేయ.

''నాకు తెలీదు సాబ్'' అని కుర్రాడు నిష్క్రమించిన తరువాత కార్తికేయ మంచం మీద కూర్చున్నాడు. తను కూర్చున్న మంచం క్రిందే పదిమంది స్టూడెంట్స్ బ్యాగ్‌లున్నాయని అతడు గమనించ లేదు.

క్రింద మేనేజర్ హోటల్ కుర్రాడిని ''కష్టమర్ల సామానులు హోటల్ బయట వరకూ తీసుకెళ్ళటం కూడా బద్ధకమై పోయిందట్రా'' అని తిడుతున్నాడు.

''ఆయనకి పక్కరూమ్‌లో ఎవరో తెలిసిన వాళ్ళున్నట్టున్నారు. అటెళ్ళారు సార్'' అన్నాడు కుర్రాడు. ఆ సంభాషణ వింటూన్న అమ్మాయిలు, అబ్బాయిలూ నవ్వుకున్నారు.

''మనం వెళ్ళి గురుడ్ని లేపేద్దామా?'' అన్నదొక అమ్మాయి.

''అప్పుడే వద్దు. వెంటనే అయితే గొడవ చేస్తాడు. మనం ముందు ఆ కొత్త రూమ్ లో సెటిల్ అవుదాం పదండి'' అంది అనూజ్ఞ. అందరూ 22 నెంబర్ గదిలోకి వెళ్ళి సెటిల్ అయ్యారు. ఐదు నిముషాలు గడిచాయి.

కార్తికేయ గదిలోంచి బయటకొచ్చి, డైనింగ్ హాల్ వైపు వెళ్ళటం గమనించారు. రాత్రి తొమ్మిదిన్నర దాటుతోంది. హిమాచల్ ప్రదేశ్‌లో ప్రతి ఊరూ దాదాపు ఎనిమిదింటికే నిద్రపోతుంది. కొండ మీద పట్టణం కాబట్టి ఇళ్ళు 'విశాలంగా' ఉండవు. రెండు మూడు అంతస్తుల్లా ఉంటాయి. కార్తికేయ క్రింది సెల్లార్‌లోకి వచ్చి కూర్చున్నాడు. వేడి వేడి రొట్టె తిని, టీ తాగాడు.

అతడు తిరిగి తన గది చేరుకునేసరికి దాదాపు పదింపావు అయింది. తలుపు దగ్గరగా వేసి ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు. తాళం చెవి తన దగ్గరే ఉండటంతో, హోటల్ వాళ్ళేమన్నా తీశారేమో అన్న అనుమానంతో తలుపు నెమ్మదిగా తోశాడు.

గది చీకటిగా ఉంది. తీస్తున్న తలుపుతో పాటూ వరండాలోని వెలుతురు కూడా ఒక కిరణంలాగా ఆ గదిలోకి ప్రవేశించింది. పొగ మంచులోకి టార్చిలైటు వేస్తే ఆ వెలుతురు ఒక దూలంగా ఎలా పడుతుందో అలా వెళ్లి మంచం మీద పడింది. అతడో క్షణం అయోమయంగా చూశాడు. గదంతా బ్యాగులు, పెట్టెలు ఉన్నాయి. వాటిని కాదు అతడు చూస్తోంది. మంచంమీద పడుకున్న అమ్మాయిని...!

ఆ వెలుతురుకి ఆమె ఇట్నుంచి అటు అలవోకగా కదిలి, తిరిగి నిశ్చలత్వాన్ని ఆపాదించుకుంది. ఇప్పుడామె మోము మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. తెల్లటి బుగ్గలు, మూసుకున్నప్పుడు కూడా విశాలంగా కనిపిస్తూన్న కళ్ళు, నాజూకు ముక్కు. అతడిలో చిత్రకారుడు ఆ భంగిమని తన మనోఫలకం మీద ముద్రించుకున్నాడు.

ఆ భంగిమని తిక్కన వర్ణించవలసి వస్తే ''పంచిన కెంపుబాసి, దివి బ్రాకి, దిశల్ వెలిగించి, చంద్రకాంతంబుల నీరు సేసి...'' అని ఉండేవాడు. నాచన సోమనైతే ''అరవిందనయన శరముల సరవింద నయనువు జూప...'' అని మొదలుపెట్టేవాడు. శ్రీనాథుడు అసలే రసికుడు కదా. ఆ అందానికి మరింత కన్‌ఫ్యూజ్ అయి, ''జురుత్తురు కోటర జఠరులుఠ దజగరగళ గుహానిష్ట్యాత నిష్ఠుర పవనము''ని కంగారు పడేవాడు. బమ్మెరపోతనయితే ఈ అమ్మాయిని మర్చిపోయి ఈమెని 'నల్లనివాడు, పద్మనయనమ్ములవాడు' ఆ కృష్ణుడు చూస్తే బావుండేది కదా అని భక్తి పారవశ్యంలో మునిగిపోయేవాడు. వేమనైతే తన యవ్వన కాలాన్ని గుర్తు తెచ్చుకుని 'గంగిగోవు పాలు గరిటెడైనను చాలు' అని వేదాంతం లోంచి శృంగారంలోకి ఓరగా చూసేవాడు. అల్లసాని పెద్దన మర్యాదగా ''యండమూరి రచనల్లో చాలాసార్లు నేనొచ్చాను కదా నన్నొదిలిపెట్టండి'' అనేవాడు. ధూర్జటి పేరులోనే చిరాకు ఉంది. ''చాలు చాలు... సంతోషించితి! రతిరాజద్వార సౌఖ్యంబులన్ శ్రీకాళహస్తీశ్వరా!'' అని శతకం వ్రాసుకునేవాడు. సరే తెనాలి రామకృష్ణుడి సంగతి తెలియనిదెవరికి? ఆ అమ్మాయిని తన పక్కనే ఊహించేసుకుని ''పూవుదేనియ దడిసిన మావి చిగురు మీదనంటి చరింతు తుమ్మెదనై...'' అని ప్రగల్భాలు పలికేవాడు. ముద్దుపళని అంత సులభంగా ఆ అమ్మాయి పడక భంగిమని ఒక వాక్యంలో వర్ణించటానికి చచ్చినా ఒప్పుకోక, ''రెచ్చిపోయి తరుణి నునుతొడలు తలగడ దిండ్లాయె; వెలది రొమ్ములు చెంప బిళ్ళలాయె... అలమి కౌగిట జేర్చ అడ్డమయ్యామని హారంబులొల్ల హంస గమన'' అని హెరాల్డ్ రాబిన్సే సిగ్గుపడేలా వర్ణిస్తే, ఇక త్యాగరాజుకి ఇవేమీ పట్టవు. ఇంత అందమైన అమ్మాయిని చూపించినా 'సొగసు చూడతరమా?' అని రాముణ్ణే పొగుడుతాడు. గురజాడ అప్పారావు గారైతే ''...తగటు బంగరు చీరె కట్టి – కురుల పువ్వుల సరులు జుట్టి నానే. ఇంకా కన్యాశుల్కమెందుకు?'' అని దెబ్బలాడతాడు. కవి సామ్రాట్ విశ్వనాథ వారైతే ఆ అమ్మాయి చెంపమీద పడే వెలుగుని చూసి ''అది వెలుగుకాదు వెన్నెల. దీపపు వెలుగు ఆమె చెంపమీద పడటము వలన వెన్నెల అయినది. అసలు వెలుగు అనగానేమి? ఒక్కొక్కచోట వెలుగు ఒక్కొక్క రకముగా భాసిల్లును. చెంప మీద పడిన పరావర్తనము చెందును. నడుముమీద పడిన విశ్లేషణము చెందును. కొన్ని విశేషస్థానములందు పడిన అది తిరిగి కనపడక అదృశ్యమగును...'' అని, అమ్మాయిని మరిచి వెలుగుతో సాగిపోతారు. ఇక నండూరివారైతే ఆ మాత్రం వెలుగు కూడా పడకుండా చప్పున తలూపేసేసి, ''ఆరిపేయవే దీపమూ, జిమ్ము జిమ్మంటూ తోట సీకటైపోవాలి. సీకట్లో సూడాలి నీ కళ్ళు తళతళలు...'' అని ఎంకిని గుర్తు చేసుకుంటారు. ఆ అమ్మాయి పెదవి వంపునీ, స్థనాగ్రాలనీ, నైటీలోంచి కనిపించే కాళ్ళనీ, ఇంకా ఆ మెడనీ, మెడవంపునీ, మైదానంలాటి పొత్తి కడుపు మీద ముడతనీ, మెడనించి క్రిందికి జారిన లోతు గీతనీ, రాధామనోహర పూల్లాటి కళ్ళని చూస్తూ, ''ఏమిటి నీ ఉద్దేశ్యం. ఇట్లా వెంటపడి వేధిస్తావు? నలుగుర్లో నాకు నవుటాలైపోయింది'' అంటాడు చలం. జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు (ఎనభై ఏళ్ళుండవూ ఆయనకి) గట్టిగా నిట్టూర్చి ''నీరసమైన నీ ప్రణయపు నీ హృదయమ్మిది. నీ రసగీతిలో కరిగి నీరయిపోవుచునుండె...'' అంటారేమో. సరే– మావాడు బాలగంగాధరుడయితే ఆమె నుదుట తిలకమిడి ''నా మీద నీ చూపు చీకట్లు ముసురుకొని,

ఎరుపెరుపు రూపము దాల్చుకొని'' అంటూ హోమనిస్టు కాన్సెప్టులో రొమాంటిసిజాన్ని మిళితం చేయటానికి ప్రయత్నం చేసి ఆ ప్రయత్నంలో తనను తాను పోగొట్టుకుంటాడు. గురువుగారు కృష్ణశాస్త్రిగారైతే గుంభనంగా ''ఏ ఊహ వేసిన బొమ్మవో, ఏ చేయి పూసిన వన్నెవో, అపరంజి కుంకుమ చిన్నెలో, సంజెలో... మబ్బు పింజెలో...'' అని మురిసి పోతారు. ఆ అమ్మాయి పడుకున్న భంగిమని ఒక సంచలన రచయిత వ్రాయాల్సి వస్తే, ఏం రాస్తే ఏ విమర్శకుడు ఇంగ్లీషు నవల్లోంచి కాపీ అంటాడో అని భయపడుతూ నెమ్మదిగా ''ఆమె అడుగులు హంసల రాకలు. కన్నులు కలువల రేకులు. పెదవులు తమలపాకులు. పలుకులు తేనెల వాకలు. ఆమె అరవిందం పొత్తిళ్ళలో హిమబిందువులా ఉంది'' అంటాడు.

''ఎక్స్యూజ్‌మి. మాడమ్''

ఆమె అప్పుడే నిద్ర నుంచి మెలకువ వచ్చినట్టు కళ్ళు విప్పి ''ఎవరదీ'' అంది.

''క్షమించండి. ఇది నా గది.''

ఆమె లేచి కూర్చుని, ''ఇది మీ గది ఏమిటి? మాది. రెండు రోజులైంది దీన్ని ఆక్యుపై చేసి.''

''కాదు మాడమ్. పక్కరూమ్ లోంచి రెండు గంటల క్రితమే దీనిలోకి షిఫ్టు చేశారు.''

''నాన్సెన్స్. మేమున్న గదిలోకి మిమ్మల్నెలా మారుస్తారు? పదండి వెళ్ళి అడుగుదాం.''

మేనేజర్ అప్పుడే హోటల్ వెనుక వైపునున్న ఇంటికి వెళ్ళటానికి ఆయత్తమవుతున్నాడు. నలుగురు స్టూడెంట్లు, కార్తికేయ కలిసి వచ్చేసరికి కంగారు పడ్డాడు. విషయమంతా తెలుసుకొని మరింత అయోమయంలో పడ్డాడు. ''...రూమ్ ఖాళీ చేయమని చెప్పి అయిదొందలు పంపారు కద్సార్'' అన్నాడు. కార్తికేయతో.

''అడ్వాన్సుకోసం పంపమని మీరే చెప్పారుగా.''

''పోలీస్ కమీషనర్ పంపిన మీ దగ్గర అడ్వాన్సా?''

''రూమ్ షిఫ్టు చేయమని బాయ్ ని కూడా పంపారు.''

''హాయ్ రామ్... నేనా?''

మరో రెండు నిముషాల సంభాషణ తరువాత మేనేజర్‌కి జరిగినదంతా అర్థమైంది. అది ఎవరాడిన నాటకమో కూడా అర్థమైంది. అమ్మాయిల వైపు తిరిగి ''ఏమిటిదంతా మాడమ్'' అని అడిగాడు.

''మాకేం తెలుసు? మా రూమ్‌లోకి రాత్రిపూట వచ్చిన ఆయన్ని అడగండి'' అన్నారు దబాయింపుగా. మేనేజర్ రూమ్ బాయ్ తో ''నిన్ను సామాన్లు వేరేగదిలో పెట్టమన్న మనిషిని గుర్తుపట్టగలవా?'' అని అడిగాడు.

అనూజ్ఞ కల్పించుకుని ''చూడండి... మేం మా కాలేజీ అధికారుల్తో మాట్లాడాం. రెండు రూములు బుక్ చేయమని టెలిగ్రాము నెల రోజుల క్రితమే ఇచ్చినట్టు కన్‌ఫర్మ్ చేశారు. మీరేమో పోలీసుల్నుంచి రికమెండేషన్ వచ్చేసరికి మా కివ్వాల్సిన

రూము పీకి ఇంకొకళ్ళకి ఇచ్చారు. అందుకని ఇప్పుడు మేం న్యాయబద్ధంగా మా రూము తిరిగి సంపాదించుకున్నాం. దీన్ని చచ్చినా వదలం. ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి''

పది నిమిషాలపాటు పెద్ద ఎత్తున వాగ్వివాదం జరిగింది. అమ్మాయిలూ అబ్బాయిలూ గట్టిగా అరవసాగారు. మానేజరు నిస్సహాయుడవటం చూసి కార్తికేయ కల్పించుకుంటూ ''పోన్లెండి. అనవసరంగా గొడవ వద్దు. నేను వేరే హోటల్ వెతుక్కుంటాను'' అని వెళ్ళి తన సామానులు, సరిగ్గా ప్యాక్ చేయని తన పెయింటింగ్ తీసుకుని వచ్చాడు.

''సారీ సార్. ఒక్కరూము కూడా ఖాళీలేదు. ఆ స్టూడెంట్స్‌తో గొడవ పెట్టుకుంటే...'' మేనేజర్ క్షమాపణలు చెప్పాడు. కార్తికేయ ''ఇట్సాల్‌రైట్...'' అంటూ బయటికి వచ్చేశాడు.

అయితే అనుకున్నంత సులభంగా ఏ హోటల్లోనూ రూము దొరకలేదు. సిమ్లాలో నడక అంత సులభం కాదు. అకస్మాత్తుగా రోడ్డు మాయమై మెట్లు ప్రత్యక్షమవుతాయి. ఒక్కోచోట రోడ్లు నిలువుగా పైకి వెళతాయి. అలాటి దారుల్లో ఒక ఫర్లాంగు నడవటానికే అరగంట పడుతుంది. విపరీతమైన ఆయాసం వస్తుంది. అతడు రెండు హోటల్స్ తిరిగేసరికి అర్ధరాత్రయింది.

విపరీతంగా మంచు కురుస్తోంది. కొంచెందూరం నడిచేసరికి దారి తప్పానని గ్రహించాడు. మినుక్కు మినుక్కుమని వెలుగుతున్న లైట్లు ఇళ్ళు కావు. మంచులో రిఫ్లెక్షన్సు. ఎడారుల్లో ఎండమావులు మనిషిని ఎలా భ్రమ పెట్టి ఆకర్షిస్తాయో అలా మంచులో దూరపు దీపాలు వ్యతిరేక దిశలో కనబడి మోసం చేస్తాయి. అతడలాగే మోసపోయాడు. మంచు తుఫాను మొదలైంది.

పలకరించటానికి పిట్టకూడా లేనంత నిర్జీవంగా మంచులో కప్పబడిపోతోంది ఊరు. బ్యాగు పట్టుకుని నిస్సహాయంగా నిర్జీవంగా కాళ్ళీడ్చుకుంటూ కొంతదూరం నడిచాడు. మొహంమీద మేకులు కొట్టినట్టు మంచు, చెవులు చిల్లులు పొడుస్తున్నట్టు హోరుగాలి. ఆ కష్టం అనుభవిస్తేనే తెలుస్తుంది. అతడు నెమ్మదిగా వంగి, ఆపై మోకాళ్ళమీద కూలిపోయాడు. పెయింటింగ్ గాలికి దూరంగా కొట్టుకుపోయింది.

జంతువు కాస్త అచేతనమవగానే పొంచి ఉన్న రాబందులు ఎలా వాల్తాయో, అలా అతను పడిపోగానే క్షణాల్లో మంచు అతన్ని కప్పేసింది.

'ఫ్రాస్ట్‌బైట్...' భయంకరమైన వ్యాధి! మంచుకన్నా పెద్ద విషం మరొకటి లేదు. అది సోకిందంటే చేతుల్నీ, కాళ్ళనీ, చర్మాన్నీ తినేయటం ప్రారంభిస్తుంది. అవయవాన్ని 'అంప్యూటేట్' చేసి తీసేస్తేగానీ లాభం లేదన్నంతగా నరాల్ని నాశనం చేస్తుంది.

ఇంకొంచెంసేపు ఇలా ఉంటే కార్తికేయ మరణించేవాడే. కానీ అదృష్టం బావుంది. దాదాపు అరగంట తరువాత రూమ్‌బాయ్ హమాలీ అదే దారివెంట ఇంటికి వెళ్ళడం సంభవించింది. దారి పక్కనే మంచులో కూరుకు పోయిన నల్లటి వస్త్రం అతన్ని ఆకర్షించింది. దగ్గరగా వెళ్ళి చూస్తే మనిషి.

మోకాళ్ళమీద వంగి మంచుని పక్కకి తొలగించాడు హమాలీ. అప్పుడు బయటపడ్డాడు కార్తికేయ. తను రక్షించిన వ్యక్తి 'కార్తికేయ' అని గుర్తించగానే హమాలీ మరి ఆలస్యం చేయలేదు. కాళ్ళు, చేతులు రుద్ది ముందు వేడి కలిగించటానికి ప్రయత్నించాడు. ఆ తరువాత ఆస్పత్రిలో చేర్పించాడు.

కార్తికేయ తాలూకు సామానులు… ముఖ్యంగా పెయింటింగ్‌లు భద్రపరిచాడు. ఆ కుర్రవాడికి ఎవరిమీదో తెలియని కోపంగానూ, చాలా ఉక్రోషంగానూ ఉంది. అంతకుముందు కార్తికేయ తనో పెయింటర్‌ని అని చెప్పి బొమ్మ చూపించినప్పుడే అతడంటే గౌరవం, ఇష్టం కలిగాయి. ఆ తరువాత అమ్మాయిలు మోసం చేసి, ఆపై జబర్దస్తీ చేసి, అతడిని బలవంతంగా రూము ఖాళీ చేయించినపుడు ఆ కుర్రవాడికి మొదట ఏం జరిగిందో అర్థం కాలేదు. ఆ తరువాత ఆ అమ్మాయిలు ఆడిన నాటకం అర్థమైంది. ఆ గొప్ప తెలివితేటలకు వాడు మురిసిపోలేదు. తామందర్నీ, చివరికి హోటల్ మేనేజర్‌తో సహా అందర్నీ వాళ్ళు బుట్టలో పడేసిన విధానం తెలుసుకుని కోపంతో ఊగిపోయాడు. స్టూడెంట్స్‌తో గొడవపడలేక హోటల్ మానేజర్ వాళ్ళనే సపోర్టు చేశాడని గ్రహించాడు.

హాస్పిటల్‌లో కార్తికేయను ట్రీట్ చేసిన డాక్టర్లు ఫ్రాస్ట్‌బైట్ గురించి ఏమీ నిర్ధారణ చెయ్యలేక పోయారు. కార్తికేయకి స్పృహ రావడానికి ముందు అతనికి సంబంధించిన వస్తువులు పరీక్షిస్తే అందులో పోలీస్ కమీషనర్ కళ్యాణ్‌సింగ్ అడ్రసున్న కార్డు దొరికింది. ఆయనకి ఫోన్‌చేసి కార్తికేయ విషయం చెప్పారు డాక్టర్లు.

కళ్యాణ్‌సింగ్ హుటాహుటిన ఆస్పత్రికి వచ్చాడు. తను ఎవరి కోసమైతే రూమ్ బుక్ చేశాడో ఆ వ్యక్తి అర్ధరాత్రి సామానులు పట్టుకొని నడిబజార్లో మంచుతుఫానులో ఎందుకు తిరగవలసి వచ్చిందో కమీషనర్‌కి అర్థం కాలేదు.

అప్పుడు హమాలీ కల్పించుకుని అసలేం జరిగిందో వివరంగా చెప్పాడు. వాడికి వళ్ళు మండిపోతోంది. కమీషనర్ స్వయంగా వచ్చి అడిగేసరికి అమ్మాయిలు చేసిన మోసం, కార్తికేయ దయనీయమైన స్థితి మరింత హృదయ విదారకంగా చెప్పాడు. కార్తికేయ తల్చుకుంటే అక్కడే పెద్ద గొడవై ఉండేదనీ, కేవలం అతడు మంచివాడూ, నెమ్మదస్తుడూ కాబట్టే తన సామానులు తీసుకుని మంచు తుఫానులో నడిచి బయటకు వెళ్ళిపోయాడని వివరించాడు.

కమీషనర్ కళ్యాణ్‌సింగ్‌కి ఇది తన స్వయం ప్రతిష్టకి సంబంధించిన విషయంలా కనిపించింది. ఈ అవమానం తనకే జరిగినట్టు భావించాడు. వెంటనే హోటల్ బ్రైట్‌కి వెళ్ళి మేనేజర్‌ని ఎంక్వయిరీ చేశాడు. అతడు జరిగినదాన్ని ధృవీకరించాడు.

''రూమ్ నెంబర్ 21, 22 ల్లో ఎవరున్నారో తీసుకురా'' అని క్రింది అధికారికి చెప్పాడు. రెండు నిముషాల తర్వాత గోవింద్ అతని ముందు హాజరు పెట్టబడ్డాడు. ఆ కుర్రాడు వణికిపోతున్నాడు.

‘‘నీ పేరు? ఎక్కడ చదువుతున్నావు?

‘‘గోవింద్. జవహర్‌లాల్ యూనివర్శిటీ. ఢిల్లీ’’

‘‘మీ స్నేహితులంతా ఎక్కడ?’’

‘‘అందరూ షాపింగ్‌కి వెళ్ళారు.’’

ఈ సంభాషణ ఇక్కడ జరుగుతున్న టైమ్‌కి అనూజ్ఞ తన స్నేహితురాళ్ళతో సిమ్లా కుడిపక్క చౌక్‌లో రద్దీ మార్కెట్‌ని దున్నేస్తోంది.

‘‘మరీ ఇంత టాక్స్ ఏమిటే మాకు’’ దీనంగా అడిగింది స్నేహితురాలు.

‘‘నేను పందెం గెలిచి రూమ్ సంపాదిస్తే మీరు నేనేమడిగితే అదిస్తామన్నారు గుర్తుందా?’’

‘‘అలాగని ఇప్పటికే రెండువేలు బిల్ చేశావు కదే!’’

‘‘అందరూ లక్షాధికార్ల కూతుళ్ళే. మీకు రెండువేలు ఓ లెక్కా’’

‘‘నువ్వు సెంట్రల్ మినిష్టర్ కూతురివిగా. నీ కెందుకూ ఈ పంతం?’’

‘‘పంతం కాదు. పందెం. నేనోడిపోయి ఉంటే నాచేత మీరు ఖర్చు పెట్టించకుండా వదిలేవారా?’’

అక్కడ హోటల్లో కమీషనర్ గోవింద్‌ని ప్రశ్నిస్తున్నాడు. ‘‘నిన్నరాత్రి కార్తికేయ గొంతుతో మేనేజర్‌తో మాట్లాడింది ఎవరు?’’ గోవింద్ మాట్లాడలేదు. ‘‘సమాధానం కావాలి’’ కర్కశంగా పలికింది కళ్యాణ్ గొంతు.

‘‘నే...నేనే’’ గోవింద్ అన్నాడు.

‘‘కార్తికేయకి ఫోన్‌చేసి అడ్వాన్స్ పంపమన్నది ఎవరు?’’

‘‘నా ఫ్రెండ్.’’

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments